దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆరోపించారు. తంజావూరులో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ... రాజకీయాలలో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరని, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయ పార్టీల మధ్య పొత్తు ఖరారవుతుందని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పొత్తుల వ్యవహారంపై జనవరిలో నిర్వహించే మహానాడులో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారని, అయితే ప్రజల కోరిక నెరవేర్చాలిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనన్నారు. బిహార్ రాష్ట్రంలోనే ఓట్ల చోరీ జరగలేదని, తమిళనాడు సహా అన్ని రాష్ట్రాల్లో ఇది కొనసాగుతోందని, దానిని అడ్డుకోవాల్సిన బాధ్యత ఈసీపై ఉందని ఈ వ్యవహారంలో న్యాయస్థానాలు కూడా జోక్యం చేసుకోవాలని ప్రేమలత విజ్ఞప్తి చేశారు.

■ పార్టీ పేరు, చిహ్నం వ్యవహారం

రాందాస్ తరపున కెవియట్ పిటిషన్



డాక్టర్ రాందాస్

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీఎంకే పేరు, చిహ్నం వ్యవహారంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తరపున మద్రాసు హైకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలైంది. 2024 డిసెంబరులో విల్లుపురంలో జరిగిన పీఎంకే ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రాందాస్, తన పెద్ద కుమార్తె గాంధీమతి కుమారుడు ముకుందన్‌ను పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా ప్రకటించారు. దానికి పార్టీ అధ్యక్షుడు అన్బుమణి అభ్యంతరం వ్యక్తం చేయడంతో అప్పటి నుంచి తండ్రీ, కొడుకుల మధ్య మనస్పర్ధలు ఏర్పడిన విషయం తెలిసిందే. అనంతరం మేలో జరిగిన వన్నియర్ సంఘం మహానాడులో తన కుమారుడు అన్బుమణికి పార్టీలో ఎలాంటి అధికారాలు లేవని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు తానే నిర్ణయాలు తీసుకుంటానని రాందాస్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాందాస్ తరపున పీఎంకే కార్యదర్శి మురళి శంకర్ హైకోర్టులో దాఖలుచేసిన కెవియట్ పిటిషన్‌లో... పీఎంకే అధ్యక్ష పదవి నుంచి తొలగించిన అన్బుమణికి, ఆయన మద్దతుదారులకు పార్టీలో ఎలాంటి అధికారం లేదని, వారు పార్టీ పేరు, చిహ్నం కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు స్వీకరించేటప్పుడు తమ వాదనల్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు.

మిత్రపక్షాలకు సీట్ల కోటా కుదింపు?

● సీఎం స్టాలిన్ సమాలోచన



వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలకు సీట్లు తగ్గించాలని డీఎంకే భావిస్తోందా?.. బలానికి మించి ఎక్కువ స్థానాలిచ్చి సీట్లు కోల్పోవడం కన్నా తామే ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి లబ్ధి పొందాలని ఆ పార్టీ భావిస్తోందా?.. ఈ మేరకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ యోచిస్తున్నారా?.. అవుననే అంటున్నాయి డీఎంకే వర్గాలు. ఇప్పటికే స్టాలిన్ దీనిపై సీనియర్లతో కలిసి కసరత్తు చేసినట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 2026 శాసనసభ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

డీఎంకే కూటమిలో కాంగ్రెస్, ఎండీఎంకే, డీపీఐ, సీపీఎం, సీపీఐ, కేఎండీకే, ఎంఎన్ఎం, ఐయూఎంఎల్, తమిళగ వాల్వురిమై కట్చి, ఎంఎంకే, ఎంవీకే, ఆది తమిళర్ పేరవై తదితర పార్టీలున్నాయి. ఇందులో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, డీపీఐ, ఇండియ యూనియన్ ముస్లింలీగ్,మనిదనేయ మక్కల్ కట్చి తప్ప మిగిలిన పార్టీల అభ్యర్థులంతా గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే చిహ్నంపైనే పోటీ చేశారు. గత శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్ 25, డీపీఐ, సీపీఎం, సీపీఐ తలా 6, కేఎండీకే, ఐయూఎంఎల్ పార్టీలు తలా3,ఇతర పార్టీలకు కలిపి ఆరు స్థానాలు కేటాయించారు. ఆ ఎన్నికల్లో డీఎంకే అత్యధికంగా 188 స్థానాల్లో పోటీ చేసి, 133 స్థానాల్లో విజయం సాధించింది. డీఎంకే 1989వ సంవత్సరం తర్వాత ఇన్ని స్థానాల్లో పోటీ చేయడం ఇదే ప్రథమం. డీఎంకే కూటమి పార్టీలు పోటీచేసిన 46 స్థానాల్లో 26 మాత్రమే గెలుపొందాయి. ఆ ప్రకారం, డీఎంకే కూటమి 159 స్థానాల్లో విజయం సాధించినట్లయింది. ఈ నేపథ్యంలో, రాబోయే శాసనసభ ఎన్నికల్లో 200 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్న డీఎంకే మిత్రపక్షాలకు స్థానాలు తగ్గించాలని యోచిస్తోంది. ప్రస్తుతం డీఎంకే కూటమిలో ఉన్న ఎంఎన్ఎం, తమిళగ వాల్వురిమై కట్చి, ఎంఎంకే, ఎంవీకే, ఆదితమిళర్ పేరవై మినహా మిగిలిన పార్టీలు 2019 పార్లమెంటు ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేశాయి. దీంతో ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీలకు కూడా న్యాయం చేయాలని స్టాలిన్ భావిస్తున్నారు.గత చరిత్రను పరిశీలిస్తే 1971 తర్వాత డీఎంకే ప్రభుత్వం వరుసగా రెండో సారి అధికారం నిలబెట్టుకోలేకపోయింది. అయితే ఆ సంప్రదాయాన్ని మార్చాలనే పట్టుదలతో ఉన్న స్టాలిన్.. ఈ సారి సీట్ల కేటాయింపులో నిర్మొహమాటంగా వ్యవహరించాలని భావిస్తున్నట్లు సమాచారం. అందువల్ల మిత్రపక్షాల్లో ఆయా పార్టీలు గెలిచే స్థానాలను మాత్రమే ఇవ్వాలని, మొహమాటానికి పోయి ఎక్కువ స్థానాలు ఇవ్వకూడదని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలిసింది.గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 25 సీట్ల కేటాయించగా 18 మాత్రమే గెలుచుకుంది. అదే విధంగా డీపీఐ 6 సీట్లలో 4 విజయం సాధించింది. కానీ, కమ్యూనిస్టు పార్టీలు 12 సీట్లకు గాను 4 మాత్రమే గెలుచుకున్నాయి. ఐయూఎంఎల్ కూడా మూడు సీట్లను కోల్పోయింది. అందువల్ల, ఈ సారి కాంగ్రెస్‌కు 20 సీట్లు, కమ్యూనిస్టు పార్టీలకు 8 సీట్లు, ఐయూఎంఎల్‌కు 1 సీటు మాత్రమే ఇవ్వాలని స్టాలిన్ భావిస్తున్నట్లు తెలిసింది. అదే విధంగా డీపీఐకి ఇచ్చిన స్థానాల్లో కూడా కోత పెట్టనున్నట్లు సమాచారం. మిత్రపక్షాలకు తగ్గించిన స్థానాలను గతంలో తమకు అండగా నిలిచిన చిన్న పార్టీలకు కేటాయించాలని స్టాలిన్ నిర్ణయించినట్లు తెలిసింది. అదే విధంగా కూటమిలోకి కొత్తగా వచ్చే పార్టీలకు కూడా కొన్ని స్థానాలు ఇవ్వడంతో పాటు వాటిని తమ పార్టీ చిహ్నంపైనే పోటీ చేయించేలా స్టాలిన్ యోచిస్తున్నారు. దీనిపై త్వరలోనే ఆయా పార్టీలతో చర్చించి, తన నిర్ణయాన్ని వెల్లడించేందుకు స్టాలిన్ యోచిస్తున్నట్లు తెలిసింది.

జర్మన్ నుంచి ప్రాచీన తమిళ తాళపత్రాలు

● రోజా ముత్తయ్య లైబ్రరీకి అప్పగించిన సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల జర్మన్‌లో పర్యటించినప్పుడు కొలోన్ విశ్వవిద్యాలయం తమిళ శాఖ నుంచి తెచ్చిన ప్రాచీన తమిళ తాళపత్రాలను తరమణిలోని రోజా ముత్తయ్య పరిశోధక గ్రంథాలయం నిర్వాహకులకు చెన్నై సచివాలయంలో బుధవారం అప్పగించారు. ఈ నెల ఒకటిన స్టాలిన్ కొలోన్ వర్శిటీ తమిళ శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఆ గ్రంథాలయంలో భద్రపరచిన ప్రాచీన తమిళ తాళపత్రాలను గమనించి, వాటిని తమ రాష్ట్రంలోని తమిళ పరిశోధకులకు సాహితీ వేత్తలకు అందుబాటులో ఉంచితే బాగుంటుందన్నారు. స్టాలిన్ సూచన మేరకు అక్కడి తమిళ శాఖ నిర్వాహకులు ఆ తాళపత్రాలను ఆయనకు అప్పగించారు. ఈ నేపథ్యంలో రోజా ముత్తయ్య పరిశోధక గ్రంథాలయం నిర్వాహకులు ఆర్.బాలకృష్ణన్, ప్రకాష్, సుందర్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ తాళపత్రాలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం కూడా పాల్గొన్నారు. ఇక ప్రాచీన తమిళ సాహిత్య సంబంధిత తాళపత్రాలను, పలు సాహిత్య రచనలకు సంబంధించిన మొట్టమొదటి ప్రతులను కొలన్ విశ్వవిద్యాలయం తమిళ శాఖ భద్రపరిచిందని తెలుసుకున్న, ఆ శాఖ అభివృద్ధి కోసం 2021 జూలై 7న రూ.1.25 కోట్ల మేరకు ఆర్థిక సాయం కూడా అందించారు.



సచివాలయంలో తాళపత్రాలను గ్రంథాలయ నిర్వాహకులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సీఎం స్టాలిన్ సమక్షంలో నేడు పెట్టుబడిదారుల సదస్సు

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరులో గురువారం రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడిదారుల సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ఉదయం 11 గంటలకు విమానంలో హోసూరు వెళ్తున్నారు. అక్కడి నుండి ఆయన కారులో హోసూరు థళి రోడ్డులో ఉన్న ఆనంద్ గ్రాండ్ ప్యాలెస్‌కు చేరుకుంటారు. ఉదయం 11.30 గంటలకు సదస్సును ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు ఎల్‌కాట్ ఇండస్ట్రియల్ పార్క్‌కు వెళ్ళి కొత్త కర్మాగారానికి శంకుస్థాన చేయనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు సూళగిరి బస్‌స్టేషన్ ప్రాంతానికి చేరుకుని రోడ్‌షోలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కురుబరపల్లి డెల్టా కర్మాగార ప్రాంతానికి వెళ్లి కొత్త ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. రాత్రి కృష్ణగిరిలో బసచేయనున్నారు. శుక్రవారం కృష్ణగిరి తదితర ప్రాంతాల్లో ఏర్పాటయ్యే ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కృష్ణగిరి రిజర్వాయర్‌లో కుటుంబం ఆత్మహత్యాయత్నం



రిజర్వాయర్ నుంచి ఈతగాళ్లు వెలికి తీస్తున్న లక్ష్మణమూర్తి, శారదమ్మాళ్ మృతదేహాలు



కృష్ణగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి, కీర్తిక

● ఇద్దరి మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం

చెన్నై/కుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా కుప్పం పట్టణానికి చెందిన ఓ కుటుంబం తమిళనాడు రాష్ట్రంలో జిల్లా కేంద్రమైన కృష్ణగిరి సమీపంలో వున్న కేఆర్‌బీ డ్యాంలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు నలుగురిలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం మేరకు ....

లక్ష్మణమూర్తి (50) కుటుంబం కుప్పం పట్టణం కొత్తపేట జయప్రకాశ్ రోడ్డులో నివాసముంటోంది. టీ బంకుతో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబంలో లక్ష్మణమూర్తి అత్త శారదమ్మాళ్ (75), భార్య జ్యోతి (45), కుమార్తె కీర్తిక (20) సభ్యులుగా ఉన్నారు. నలుగురు సభ్యులతో కూడిన ఈ కుటుంబం బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి ఎవరికీ చెప్పకుండా కృష్ణగిరి వెళ్లింది. కేఆర్‌బీ డ్యాంలో చిన్న స్లూయిస్ గేటు వద్దకు వచ్చిన వీరంతా హఠాత్తుగా డ్యాంలోకి దూకారు.డ్యాం దిగువభాగంలో చేపలు పట్టుకుంటున్న జాలరులు గమనించి వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే ఇద్దరు మహిళల్ని మాత్రమే రక్షించగలిగారు.లక్ష్మణమూర్తి కుటుంబం మొత్తం రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యాయత్నం చేసిందన్న సమాచారం అక్కడి పోలీసుల ద్వారా కుప్పంలో ఉన్న వారి బంధువులకు అందింది. ఈ దుర్ఘటనలో లక్ష్మణమూర్తితోపాటు ఆయన అత్త శారదమ్మాళ్ మృతి చెందారు. ఆయన భార్య జ్యోతి, కుమార్తె కీర్తికలను మత్స్యకారులు గమనించి బయటకు తీసుకు వచ్చారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని చికిత్స నిమిత్తం స్థానిక పోలీసులు కృష్ణగిరి ఆసుపత్రిలో చేర్చారు. సమాచారం అందుకున్న కృష్ణగిరి డ్యాం పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను వెలికి తీసి, పోస్టుమార్టం కోసం కృష్ణగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో లక్ష్మణమూర్తి కుటుంబం ఆత్మహత్యా యత్నం చేసినట్లు చెబుతున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో బంధువర్గంతోపాటు కొత్తపేట మొత్తం శోకసంద్రమైంది. కృష్ణగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎంకే నిలిపేసిన పథకాలు మళ్లీ ప్రారంభిస్తాం

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి



పొల్లాచ్చి సభలో మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్‌తో ఈపీఎస్

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే డీఎంకే ప్రభుత్వం నిలిపేసిన పథకాలను మళ్లీ ప్రారంభిస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. కోవై జిల్లా పొల్లాచ్చి అసెంబ్లీ నియోజకవర్గంలో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో కుల సంఘాల ప్రతినిధులు, రైతులు, నేత కార్మికులు, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు. ఈపీఎస్ ప్రసంగానికి ముందుగా ఆయా సంస్థల తరపున ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఓ రైతు మాట్లాడుతూ.. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కల్లు దుకాణాలు ఎందుకు ప్రారంభించలేదని నిలదీయడంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. అనంతరం ఈపీఎస్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో పామాయిల్‌కు బదులు కొబ్బరి నూనె పంపిణీ చేయాలని, కల్లు గీతకు అనుమతించాలని రైతులు కోరుతున్నారని, దీనిపై అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కోవై ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేవన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమలుపరిచిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజకీయకక్ష్య కారణంగా డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిందని, వాటిని తాము అధికారంలోకి వచ్చాక మళ్లీ ప్రారంభిస్తామని హామి ఇచ్చారు. సభలో మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

22న శివగంగలో ధర్నా...

శివగంగ జిల్లా మానామదురై మున్సిపాలిటీ పనితీరుకు నిరసనగా ఈ నెల 22న శివగంగలో అన్నాడీఎంకే తరపున ధర్నా నిర్వహించనున్నట్లు ఈపీఎస్ ఓ ప్రకటనలో తెలిపారు. మానామదురై సిప్కాట్ పారిశ్రామికవాడలో రెండేళ్ల క్రితం మెడికేర్ ఎన్విరాన్‌మెంటల్ సంస్థ మెడికల్ బయో వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే కర్మాగారాన్ని ప్రారంభించేందుకు యత్నించగా, స్థానికులు అభ్యంతరం తెలియజేయడంతో నిలిపివేశారు. అయితే, ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వం ఆ కర్మాగారానికి అనుమతులు ఇవ్వడంతో పనులు ప్రారంభించారని తెలిపారు. డీఎంకే ప్రభుత్వ తీరును, మున్సిపాలిటీ వైఖరిని ఖండిస్తూ ఈ నెల 22వ తేది ఉదయం మానామదురై తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఈపీఎస్ తన ప్రకటనలో తెలిపారు.

డాక్టర్, పారిశ్రామికవేత్త నివాసాల్లో ఈడీ దాడులు



వేళచ్చేరి పారిశ్రామికవేత్త నివాసం వద్ద అధికారుల కార్లు - పారిశ్రామికవేత్తను విచారిస్తున్న ఈడీ అధికారి

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ వైద్యురాలు, ఓ పారిశ్రామికవేత్త ఇళ్లు, కార్యాలయాలు సహా ఐదు ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఈడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. వేళచ్చేరిలో భవన నిర్మాణ సంస్థకు అధిపతి అయిన ప్రముఖ పారిశ్రామికవేత్త హమీద్ పిస్‌నాయ్ నివాసం, కార్యాలయాలకు రెండు కార్లలో వెళ్ళిన ఎనిమిదిమంది ఈడీ అధికారులు సోదాలు జరిపారు. వేళచ్చేరి, వెస్ట్‌మాంబళం ప్రాంతాల్లో ఈ దాడులు నిర్వహించారు. హమీద్ పిస్‌నాయ్ భవన నిర్మాణ సంస్థలో భారీయెత్తున అక్రమ నగదు బట్వాడా తోపాటు పన్నుల ఎగవేత కూడా జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. కొద్ది నెలల క్రితం హమీద్ నివాసగృహం, కార్యాలయంలో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. ఆ సమయంలో లభించిన పత్రాల్లోని సమాచారం మేరకే బుధవారం మళ్ళీ ఎనిమిదిమంది ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా అడయార్ గాంధీనగర్ మూడో వీధిలో నివసిస్తున్న ఇందిర అనే వైద్యురాలి ఇంటిలోనూ బుధవారం ఉదయం ఈడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. అక్రమ నగదు బట్వాడా, పన్నులను ఎగవేసినట్లు ఆరోపణలు రావటంతో ఈ దాడులు జరిగాయి. ఇదే విధంగా వెస్ట్‌మాంబళంలో రాజీ వీధిలో నివసిస్తున్న సుబ్రమణి రామచంద్రన్ అనే ప్రముఖుడి నివాసంలో ఈడీ అధికారులు దాడులు జరిపేందుకు వెళ్ళారు. అయితే ఆ ఇంటిలో ఎవరూ లేకపోవడంతో అధికారులు తిరుగు ముఖం పట్టారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా స్థానిక ఐటీ కారిడార్ పరిధిలోని పలు వీధుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. పిళ్లయార్ ఆలయ వీధి, ఎస్బీఐ కాలనీ, గంగాళమ్మన్ ఆలయ వీధి, 200 అడుగుల రోడ్డు, పోస్టాఫీసు వీధి, ఎంసీఎన్ నగర్ మరియు ఎక్స్‌టెన్షన్, శ్రీపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

'స్వయం' వెబ్‌సైట్ ద్వారా ఉచిత విద్య

పెరంబూర్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ జాతీయ దూరవిద్య విశ్వవిద్యాలయం 'స్వయం' వెబ్‌సైట్ ద్వారా ఫైనాన్షియల్ అకౌంటింగ్, బిజినెస్ ఆర్గనైజేషన్-మేనేజ్‌మెంట్, బిజినెస్ లా, ఇన్‌కంటాక్స్ లా, మార్కెటింగ్ పాలసీ, బిజినెస్ కమ్యూనికేషన్, ఫైనాన్షియల్ లిటరసీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, మార్కెటింగ్‌లో ఉచిత కోర్సులు అందిస్తోంది. ఆసక్తి కలిగిన వారు https://swayam.gov.in/ అనే వెబ్‌సైట్ ద్వారా విద్య అభ్యసించవచ్చు.

ఏఐ కళాపోటీకి దరఖాస్తుల ఆహ్వానం

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మొట్టమొదటి ఏఐ ఆర్ట్ పోటీ అయిన 'రీ ఇమాజిన్ చెన్నై' కోసం ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 'సూపర్ చెన్నై' ఆధ్వర్యంలో జరుగనున్న ఈ పోటీలకు దరఖాస్తులు ఈ నెల 30వ తేదీ లోగా సమర్పించాల్సివుంటుంది. ఈ పోటీల్లో విశిష్ట ప్యానల్ ద్వారా ఎంపిక చేయబడిన టాప్ 25 కళాకృతులు 'ది ఏఐ ఆర్ట్ షో'లో ప్రదర్శించబడతాయి. ఔత్సాహికులు జ్జిజుజుూ౯టఱ్మటచిజ్జి్ుజీ.ఛిౌఝకు దరఖాస్తులు పంపాల్సివుంటుంది. మరిన్ని వివరాల కోసం https://www.superchennai.com/ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సంస్థ ఎండీ రంజిత్ రాథోడ్ విడుదలచేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఈబీ కార్యాలయ చిరునామా మార్పు

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై వెస్ట్ విద్యుత్ సర్కిల్ పరిధిలోని ఆవడి డివిజన్‌కు చెందిన రెడ్‌హిల్స్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం చిరునామా మారింది. ఈ కార్యాలయం ఈ నెల 11వ తేది నుంచి నెం.51, శ్రీ వెంకటేశ్వర ఆస్పత్రి వెనుక, పన్నీర్‌వాక్కం రోడ్డు, నల్లూరు, చెన్నై-67' అనే చిరునామాలో పనిచేస్తుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

15 శాతం పెరిగిన పర్యాటకులు

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సంఖ్య ప్రస్తుత సంవత్సరం 15 శాతం పెరిగిందని పర్యాటక శాఖ మంత్రి ఆర్. రాజేంద్రన్ తెలిపారు. ఈ మేరకు పర్యాటక శాఖ విడుదల చేసిన ప్రకటనలో... జనవరి నుంచి జూలై వరకు స్వదేశీ పర్యాటకులు సంఖ్య 20.35 కోట్లు, విదేశీ పర్యాటకుల సంఖ్య 7.80 లక్షలుందన్నారను. గత ఏడాదితో పోల్చితే రాష్ట్రాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య 10 నుంచి 15 శాతం వరకు పెరిగిందని తెలిపింది. రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలు అభివృద్ధి పరచయం, పర్యాటకులకు తగిన వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పర్యాటక శాఖ తెలిపింది.


మెడికల్ కౌన్సెలింగ్ వాయిదా

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కోటా సీట్ల రెండవ విడత కౌన్సెలింగ్ పొడిగించిన కారణంగా, రాష్ట్రంలో ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ వాయిదాపడింది. దేశవ్యాప్తంగా మెడికల్ సీట్లు పెంచాలని జాతీయ వైద్య కమిషన్ నిర్ణయించింది. కొత్త సీట్లను రెండో విడత కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ కారణంగా అఖిల భారత కోటాలో రెండో విడత కౌన్సెలింగ్ పొడిగించారు. అలాగే, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 500 సీట్లకు బుధవారం కౌన్సెలింగ్ జరుగనుంది. అఖిల భారత కోటాలో రెండో విడత కౌన్సెలింగ్ పొడిగించిన కారణంగా, రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

బంగారు నాణేల కొనుగోలుకు టెండర్

పెరంబూర్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): వివాహ సహాయ పథకంలో రూ.45 కోట్ల విలువైన 5,460 బంగారు నాణేలు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. సాంఘిక సంక్షేమ శాఖ అమలుచేస్తున్న 4 రకాల వివాహ సహాయ పథకాల కింద లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు 5,640 (8 గ్రాములు-22 క్యారెట్లు) బంగారు నాణేల కొనుగోలుకు ఆభరణాల తయారీదారులు,విక్రేతలు, బంగారు ఆభరణాల ఎగుమతి, దిగుమతిదారుల నుంచి ఈ-టెండర్లు ఆహ్వానిస్తోంది. బుధవారం నుంచి అక్టోబరు 9వ తేది మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్లు స్వీకరిస్తారు. టెండర్ ఫారాలు https://tntneders.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈఎండీ మొత్తం రూ.45,12,000 వెబ్‌సైట్ ద్వారా మాత్రమే చెల్లించాలి (ఆన్‌లైన్ గేట్ పేమెంట్). 19వ తేది టెండర్లు ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

13 నుంచి తిరువణ్ణామలైలో ఆధ్యాత్మిక సదస్సు



జగదీష్

చెన్నై, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13 నుంచి రెండు రోజుల పాటు తిరువణ్ణామలైలో వేద ఆగమ దేవర ఆధ్యాత్మిక సాంస్కృతిక సదస్సు జరుగనుంది. బుధవారం చెన్నై ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో 'వేద ఆగమ దేవర అన్నిగ కల్చరల్ ట్రస్టీ జగదీష్ ఈ కార్యక్రమం వివరాలను వెల్లడించారు.. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి వంటి ఆధ్యాత్మిక వేత్తలు ఈ సదస్సుకు నేతృత్వం వహించనున్నారు. శ్రీవిల్లిపుత్తూరులోని సడగోప రామానుజ జీయర్, శ్రీపురంలోని శక్తి అమ్మన్, మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి పీఠాధిపతి సెంథిల్‌కుమార్ అడిగళార్, రత్నగిరిలోని బాల మురుగన్ ఆదిమయి స్వామి, సచ్చిదానంద స్వామి తదితరులంతా ఈ సదస్సుకు హాజరుకానున్నారు. సదస్సులో భాగంగా 1,008 మంది శివాచార్యులు మహా శివపూజ నిర్వహించనున్నారు. అదే విధంగా తిరువిళక్కు పూజ, లలితా సహస్రనామ పారాయణం కూడా ఉంటుందని, మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ రామసుబ్రమణ్యం వంటి ప్రముఖుల ఆధ్యాత్మిక ప్రసంగాలుంటాయి. అంతేగాక మాస్ట్రో ఇళయరాజా కుమారుడు కార్తీక్ రాజా భక్తి సంగీత విభావరి కూడా వుంటుందని, సెప్టెంబరు 14న ప్రపంచ సాంస్కృతిక సామరస్య దినోత్సవంగా కూడా పాటించనున్నట్లు ఆయన వెల్లడించారు.



ఈశాన్యానికి ముందే నిండుతున్న జలాశయాలు

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కాక ముందే 86 శాతం జలాశయాలు పూర్తిస్థాయికి చేరువలో ఉన్నాయి. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు అక్టోబరు నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. నైరుతి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో జలాశయాల్లో నీరు చేరింది. కావేరి పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాలు, కర్ణాటక డ్యాంల నుంచి విడుదల చేసిన నీటితో మేట్టూరు డ్యాం ఈ ఏడాది ఏడో సారి పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. రాష్ట్రంలో 86శాతం జలాశయాలకు పూర్తిస్థాయికి దగ్గరలో ఉన్నాయి. ఆ ప్రకారం, మేట్టూరు డ్యాం 100 శాతం, భవానీసాగర్ డ్యాం 80.8 శాతం, అమరావతి డ్యాం 96.1, వైగై డ్యాం 89.8 శాతం నిండాయి. అలాగే, పేర్చిపారై డ్యాం 75 శాతం, కృష్ణగిరి డ్యాం 87.5, సాతనూరు డ్యాం 82.4, సోలయారు డ్యాం 97.7, పరంబికుళం డ్యాం 99.6, ఆళియారు డ్యాం 98.67 శాతం నిండాయి. ప్రస్తుతం ఉపరితల ఆవర్తనం, ఆ తరువాత ఈశాన్య రుతుపవనాలతో కురిసే వర్షాలతో డ్యాంలకు మరింత నీరు చేరే అవకాశముంది. డ్యాంలను క్రమంగా పర్యవేక్షించాలని, అదనపు జలాలు విడుదలపై ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు, ఇంజనీర్లకు ప్రజాపనుల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

నేడు నగరంలో 'ఉంగుళడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో గురువారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, 1వ మండల పరిధిలో రామనాథపురం 1వ వీధి (వింకోనగర్ మెట్రో సమీపం) కమ్యూనిటీ హాలు, 2వ మండలం పరిధిలో ఆండార్‌కుప్పం స్కూలు క్రీడా మైదానం, 4వ మండలం పరిధిలో కొడుంగైయూర్ ఎంఆర్ నగర్‌లోని ముత్తుకుమారస్వామి కళాశాల, 5వ మండలం పరిధిలో జేకే కన్వెన్షన్ హాలు, 6వ మండలం అగరం పార్థసారథి వీధిలోని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కార్యాలయం, 7వ మండలంలో మొగప్పైర్ నందిని లక్ష్మణన్ వీధిలోని ఏఎస్ఎన్ మహల్, 8వ మండలం విల్లివాక్కం ఎంటీహెచ్ రోడ్డులోని టీకేఏ కల్యాణ మండపంలో శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, 9వ మండలం పరిధిలో థౌజండ్ లైట్స్ మిడిల్ స్కూల్ రోడ్డులోని కమ్యూనిటీ హాలు, 10వ మండలం కోయంబేడు కాళియమ్మన్ ఆలయ వీధి సీఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కాంపౌండ్‌లోని బోవ్ షెడ్, 13వ మండలం కొట్టూరు రైల్వే స్టేషన్ సమీపంలోని హాకీ స్టేడియం, 14వ మండలం పళ్లికరనై మూడో మెయిన్ రోడ్డు లోని ఐఐటీ కమ్యూనిటీ హాలు, 15వ మండలం షోలింగనల్లూర్ ప్రభుత్వ హైయ్యర్ సెకండరీ స్కూలు ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాల్లో ప్రజలు పాల్గొని సమస్యలు, ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా చేరడం తదితరాలకు వినతిపత్రాలు సమర్పించవచ్చని జీసీసీ తెలియజేసింది.

నడిగర్ సంఘానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఏంటి సమస్య?

● ప్రశ్నించిన హైకోర్టు

పెరంబూర్,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి):నడిగర్ సంఘానికి ఎన్నికలు నిర్వహించడంలో సమస్య ఏమిటీ? అని మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. కొత్త భవనం నిర్మిస్తున్నందున ఎన్నికల నిర్వహించడం నిర్మాణ పనులపై ప్రభావం చూపుతుందని నడిగర్‌సంఘం హైకోర్టుకు తెలిపింది. దక్షిణ భారత నడిగర్ సంఘం కార్యవర్గ పదవీకాలం మూడేళ్ల పొడిగించడాన్ని సవాలుచేస్తూ దాఖలైన కేసు విచారణను ఈనెల 15వతేదీకి మద్రాసుహైకోర్టు వాయిదావేసింది.

డీజీపీ కార్యాలయ సందర్శనకు నిబంధనలు

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లో ఉన్న డీజీపీ కార్యాలయాన్ని సందర్శించేందుకు విధించిన కఠిన నిబంధనలు మంగళవారం నుండి అమలులోకి వచ్చాయి. ఇటీవల ఈ కార్యాలయ ప్రవేశద్వారం వద్ద పురచ్చి తమిళగం, డీపీఐ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఘర్షణకు పాల్పడడం కలకలం రేగిన విషయం తెలిసిందే. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసుశాఖ కార్యాలయం సమీపంలో జరిగిన ఈ ఘర్షణలపై పలు రాజకీయ పార్టీల నేతలు విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో, డీజీపీ కార్యాలయాన్ని సందర్శించేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరని, అనుమతించిన ప్రాంతాల్లో మాత్రమే సందర్శకులు వెళ్లాలని, మారణాయుధాలు, బాంబులు, నిషేధిత వస్తువులతో వెళ్లేందుకు అనుమతిలేదని, ఫిర్యాదు చేసి, బయటికి వెళ్లే సమయంలో డీజీపీ కార్యాలయం ప్రవేశద్వారం వద్ద గుర్తింపు కార్డులను తిరిగి అప్పజెప్పాలని పోలీసుశాఖ విడుదల చేసిన నిబంధనల పట్టికలో సూచించింది.

హైడ్రోకార్బన్ అనుమతుల రద్దు

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రామనాథపురంలో హైడ్రోకార్బన్ వెలికితీసేందుకు ఓఎన్‌జీసీకి ఇచ్చిన అనుమతి రద్దు చేస్తూ పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ నిర్ణయం తీసుకుంది. పర్యావరణ అనుమతిని ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని ఓఎన్‌జీసీకి అథారిటీ నోటీసు పంపింది. రామనాథపురం జిల్లాలో హైడ్రోకార్బన్ వెలికితీసేందుకు ఓఎన్‌జీసీకి అనుమతులు ఇచ్చినట్లు ఇటీవల వార్తలు వెలువడ్డాయి. ఈ ప్రాజెక్టుపై తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో, ఈ ప్రాజెక్టుకు అనుమతించమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

అంగన్వాడీ, పౌష్టికాహార కార్మికుల ధర్నా

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేతనం పెంపు, పాత పింఛన్ విధానం అమలు సహా పద డిమాండ్ల సాధనకు అంగన్వాడీ, పౌష్టికాహార కార్యకర్తలు బుధవారం ధర్నా చేపట్టారు. తమిళనాడు పౌష్టికాహార, అంగన్వాడీ పింఛనర్ల సంఘం పిలుపు మేరకు మెరీనా బీచ్ సమీపంలోని శివానంద రోడ్డులో సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె.పళనిస్వామి నేతృత్వంలో నిర్వహించిన ధర్నాలో 200 మందికి పైగా ప్ల కార్డులతో పాల్గొని నిరసన తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు నిరసనగా రాష్ట్రవ్యాప్త ధర్నాలు

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా మేలపాళయం సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్‌ను ఖండిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. మేలపాళయం సబ్ రిజిస్ట్రార్ కాట్టురాజా 21 సెంట్ల భూమిని చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని తిరునల్వేలి కేంద్ర ఆర్థిక నేరవిభాగం పోలీసులు ఆయనపై కేసు నమోదుచేశారు. దీంతో, ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో, కాట్టురాజాపై సస్పెన్షన్ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని కోరుతూ చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు సహా అన్ని జిల్లాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు.

పొన్ముడి క్వారీ కేసు విచారణ వాయిదా

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పొన్ముడిపై ఎర్రమట్టి క్వారీ కేసు విచారణ ఈ నెల 23వ తేదీకి వాయిదాపడింది. విల్లుపురం జిల్లా వానూరు తాలూకా పూత్తురై ప్రభుత్వ ఎర్రమట్టి క్వారీలో నిబంధనలు అతిక్రమించి ఎర్రమట్టిని తరలించి ప్రభుత్వానికి రూ.28.36 కోట్ల మేర నష్టం చేకూర్చారంటూ, మాజీ మంత్రి పొన్ముడి, ఆయన కుమారుడు గౌతమ్ శిఖామణి, రాజమహేంద్రన్, సదానందం, గోతకుమార్, జయచంద్రన్, గోపినాథన్ తదితరులపై 2012లో జిల్లా నేర విభాగం పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు విల్లుపురం జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో జరుగుతోంది. ఈ కేసులో ఇప్పటివరకు 54 మంది సాక్ష్యులను విచారించారు. మంగళవారం జరిగిన విచారణకు, ఈ కేసులో ఛార్జిషీటు దాఖలుచేసిన అప్పటి జిల్లా నేర విభాగం డీఎస్పీగా పనిచేసి పదవీవిరమణ పొందిన విజయరాఘవన్ హాజరయ్యారు. అనంతరం, ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 23వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి మణిమొళి ఉత్తర్వులు జారీచేశారు.

త్రిశూలం రైల్వేస్టేషన్-మెట్రో స్టేషన్ అనుసంధానం

తరచూ విద్యుత్ కోతలతో పనిచేయని లిఫ్ట్ ● ప్రయాణికుల అవస్థలు

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విమానాశ్రయం సమీపంలోని అండర్ బ్రిడ్జిలో తరచూ విద్యుత్ కోతల కారణంగా లిఫ్ట్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. విమానాశ్రయం-త్రిశూలం రైల్వే స్టేషన్ అనుసంధానిస్తూ చెన్నై-తిరుచ్చి-చెన్నై జాతీయ రహదారి కింద అండర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జిని విమాన ప్రయాణికులు, విమానాశ్రయం సిబ్బంది మాత్రమే వినియోగించేవారు. అనంతరం, ఈ బ్రిడ్జిని మెట్రో రైల్వేస్టేషన్‌కు కలపడంతో మెట్రో రైలు ప్రయాణికులు కూడా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రాత్రి వేళ ఈ బ్రిడ్జి వద్ద తరచూ విద్యుత్ కోతలు ఏర్పడుతుండడంతో, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.. వర్షాల సమయంలో ఈ బ్రిడ్జిలో నీరు చేరితే ఇంకా ఇబ్బంది.. బ్రిడ్జిలో విద్యుత్ లైట్లు, లిఫ్టి తదితరాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ అండర్ బ్రిడ్జి పర్యవేక్షణ ప్రైవేటు సంస్థకు అప్పగించామని, వర్షాకాలానికి ముందే పనులు పూర్తిచేయనున్నట్లు సదరు సంస్థ తెలిపిందని రహదారుల శాఖ వివరణ ఇచ్చింది.

కులవివక్ష చూపించే ఉపాధ్యాయులపై బదిలీ వేటు

● పాఠశాల విద్య డైరెక్టర్ ఉత్తర్వులు

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో కులవివక్ష చూపే ఉపాధ్యాయులను సత్వరం బదిలీ చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలలు విద్యార్థుల మధ్య కుల సంఘర్షణలు నివారించాలని, వారు ఐక్యంగా కలసి మెలసి చదువుకొనేలా చర్యలు చేపట్టాలని మాజీ న్యాయమూర్తి చంద్రు నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ జూన్ 18న రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో సిఫారసు చేసింది. నివేదిక ఆధారంగా పాఠశాల విద్య డైరెక్టర్ కన్నప్పన్ జిల్లా ప్రధాన విద్యాధికారులకు జారీచేసిన ఉత్తర్వుల్లో... పాఠశాల విద్యార్థుల్లో కుల, మత భావాలు రెచ్చగొట్టేందుకు కారణమయ్యే ఉపాధ్యాయులపై ఫిర్యాదుఅందితే,వారిని వెంటనే వేరే పాఠశాలకు బదిలీ చేయాలని, అత్యంత వెనుకబడిన తరగతులు, ఆదిద్రావిడ సంక్షేమ శాఖ ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడానికి వివరాలు అవసరమైతే, విద్యార్థులను వ్యక్తిగతంగా ప్రిన్సిపాల్ కార్యాలయానికి పిలిపించి సేకరించాలని, ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి. పాఠశాలకు విద్యార్థులు సెల్‌ఫోన్ తీసుకురావద్దని సూచించాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు తెలియజేసేలా పాఠశాలల్లో 'స్టూడెంట్ మైండ్' ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటుచేయాలి. ఈ పెట్టెను వారానికి ఒకసారి ప్రధానోపాధ్యాయుడు సమక్షంలో తెరిచి, ఫిర్యాదులను సలహా కమిటీ ద్వారా దర్యాప్తు చేయాలి అంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవినీతి

● మాజీ ఎంపీ అన్బుమణి

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనసాగుతున్న అవినీతిని అడ్డుకోలేని డీఎంకేను రైతుల క్షమించరని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని పీఎంకే మాజీ ఎంపీ డా.అన్బుమణి విమర్శించారు. ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో వరి కోతలు నెలరోజుల ముందే ప్రారంభమయ్యాయని, రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, కానీ మార్కెట్ కమిటీ నిర్వాహకులు కమిషన్ లేనిదే ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. 2024లో సాధారణ రకం క్వింటాలుకు రూ.2,405, సన్నరకం రూ.2,450 కొనుగోలు ధర నిర్ణయించారని అయితే, ఈ ఆర్థిక సంవత్సరం రూ.95 మాత్రమే పెంచడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి నాణ్యత బట్టి కొనుగోలు ధర పెంచాలని, కొనుగోలు కేంద్రాల్లో అధికమైన అవినీతిని అడ్డుకోవాలని అన్బుమణి డిమాండ్ చేశారు.

హత్యకేసులో డీఎంకే నేత మనవడికి బెయిలు

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో కళాశాల విద్యార్థిని కారుతో ఢీకొట్టి హతమార్చిన కేసులో అరెస్టయిన డీఎంకే నేత మనవడికి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు నిబంధనలతో కూడిన బెయిలు మంజూరు చేసింది. అయనావరం ముత్తమన్ వీధికి చెందిన కళాశాల విద్యార్థి నితిన్‌సాయి హత్యకేసులో డీఎంకే నేత ధనశేఖర్ మనవడు చంద్రు చరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. బెయిలు కోరుతూ చంద్రు దాఖలుచేసిన పిటిషన్ బుధవారం న్యాయమూర్తి ఎస్.కార్తికేయన్ విచారించారు. మృతిచెందిన విద్యార్థి స్నేహితుడు పిటిషనర్ ప్రయాణం చేసిన కారును రాళ్లతో ధ్వంసం చేశారని, స్వీయరక్షణ కోసం కారును వేగంగా నడిపిన సమయంలో దురదృష్టవశాత్తు నితిన్‌సాయి ప్రయాణం చేసిన టూ వీలర్‌ను ఢీకొని ప్రమాదం చోటుచేసుకుందని, పిటిషనర్ కారును నడపలేదని, అందువల్ల అతడిని బెయిలుపై విడుదల చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది వివేకానందన్ వాదించారు. నితిన్‌సాయి హత్య కేసుకు సంబంధించిన విచారణ పెండింగ్‌లో ఉన్నందున బెయిలు మంజూరు చేయరాదని పోలీసు తరఫున హాజరైన న్యాయవాది దేవరాజన్ కోరారు. ఇరుతరపు వాదనల అనంతరం, పిటిషనర్ ఇప్పటికే 41 రోజులు జైలు శిక్ష అనుభవించారని, అందువల్ల ఆయనను రూ.10 వేల సొంత పూచీకత్తుపై బెయిలుపై విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, చంద్రు చరణ్ ప్రతిరోజు ఉదయం 10 గంటలకు తిరుమంగళం పోలీసు స్టేషన్‌లో హాజరై సంతకం చేయాలని, తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లరాదని, ముఖ్యంగా సాక్ష్యులను ప్రభావితం చేయరాదంటూ న్యాయమూర్తి నిబంధనలు విధించారు.

మెరీనాలో పారిశుధ్య కార్మికుల ధర్నా

● 30 మంది అరెస్ట్





ధర్నాలో పాల్గొన్న కార్మికులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్ సమీపంలోని కార్మికుల స్మారక స్థూపం వద్ద డిమాండ్ల సాధన కోసం ఆకస్మిక ధర్నా చేపట్టిన 30 మంది పారిశుధ్య కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 5,6 మండలాలకు చెందిన కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు, ఆ రెండు మండలాలను ప్రైవేటీకరణ చేయడాన్ని ఉపసంహరించుకోవాలని, తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ కొన్ని రోజులుగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఆ రీతిలో కొరుక్కుపేటలో నిరాహారదీక్ష చేపట్టిన 16 మంది కార్మికులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ, బుధవారం ఉదయం సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక స్మారక స్థూపం వద్ద ధర్నాకు దిగారు. అనుమతి లేకుండా ఆందోళన చేపట్టారని పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. మండుటెండలో ఆందోళనలో పాల్గొన్న కొందరు మహిళా కార్మికులు స్పృహ కోల్పోయారు.



సినిమాకు తీసుకెళ్లలేదని మహిళ ఆత్మహత్య



సౌమ్య (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతిద): భర్త సినిమాకు తీసుకెళ్లలేదంటూ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరుప్పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. కాంగయం పడియాండిపాళయం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ జీవాకు సౌమ్య అనే యువతితో 7 నెలల క్రితం వివాహమైంది.. సౌమ్య కాంగయంలోని ఓ ఫుట్ వేర్ దుకాణంలో పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో, తనను సినిమాకు తీసుకెళ్లాంటూ భర్తను వారం రోజులుగా కోరుతున్నా, పనుల కారణంగా జీవా తీసుకెళ్లలేదు. ఈ విషయాన్ని సౌమ్య తన తల్లికి ఫోన్‌చేసి చెప్పింది. మంగళవారం భర్త ఆటోకు వెళ్లడంతో ఒంటరిగా ఉన్న సౌమ్య, హఠాత్తుగా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి అనంతరం ఇంటికి వచ్చిన జీవా, భార్య ఉరేసుకోవడం గమనించి దిగ్భ్రాంతి చెంది, ఆమెను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కాంగయం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

లైంగిక వేధింపుల కేసులో మతబోధకుడికి ఏడేళ్ల జైలు

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనాథాశ్రమంలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన మతబోధకుడికి తిరుప్పూర్ మహిళా కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. తిరుప్పూర్ సమీపం ఊత్తుకులి పల్లగౌండర్‌పాళయం కూనంపట్టికి చెందిన ఆండ్రూస్ (50) మతబోధకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఆయన పాఠశాల విద్యార్థులకు ఆశ్రమం నడుపుతున్నాడు. తల్లి లేదా తండ్రి కోల్పోయిన పిల్లలకు ఈ ఆశ్రమంలో బస కల్పించి చదివిస్తుంటారు. ఈ క్రమంలో 2022 డిసెంబరులో ఆశ్రమంలో ఉంటూ చదువుకుంటున్న 14 ఏళ్ల బాలికపై ఆండ్రూస్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. కొద్ది రోజుల అనంతరం అనారోగ్యానికి గురైన బాలిక ఇంటికి వెళ్లి, తల్లితో జరిగిన విషయం చెప్పగా, ఆమె ఊత్తుకులి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, ఆండ్రూస్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదనలు పూర్తికావడంతో న్యాయమూర్తి కోకిల... నిందితుడు ఆండ్రూస్‌కు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.

క్వారీ లైసెన్స్‌కు రూ.70వేల లంచం

● తహసీల్దార్ అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా కుసవపట్టి గ్రామంలో క్రషర్ క్వారీకి అనుమతించేందుకు రూ.70 వేలు లంచం పుచ్చుకున్న తహసీల్దార్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మదురై చిన్నఉడప్పైకు చెందిన రత్నం కుసవపట్టి గ్రామంలో క్రషర్ క్వారీ నిర్వహించేందుకు అనుమతి కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు.. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఖనిజవనరుల అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే, ఈ క్వారీకి అనుమతి రావడంలో జాప్యం జరగడంతో, రత్నం మదురై తహసీల్దార్ రాజపాండియన్‌ను కలిసి అనుమతి కోరారు. ఇందుకు రూ. లక్ష లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్, ఆ తర్వాత రూ.70వేలు ఇవ్వాలని కోరాడు. ఈ వ్యవహారంపై రత్నం మదురై ఏసీబీకి ఫిర్యాదుచేశారు. అధికారుల సూచనలతో రసాయనం కలిపిన రూ.70 వేల కరెన్సీని రత్నం మంగళవారం సాయంత్రం తహసీల్దార్ రాజపాండయన్‌కు అందిస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు అతడిని పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ రాంకీని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

కొడైకెనాల్‌లో భారీ వర్షం

● ప్రాథమిక పాఠశాలలకు సెలవు



చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో బుధవారం వేకువజాము నుండి భారీగా వర్షాలు కురవటంతో జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారులలో మోకాలిలోతున వర్షపు నీరు వరదలా ప్రవహించింది. దీనితో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షాల కారణంగా ప్రాథమిక పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఆరో తరగతి నుండి ప్లస్-2 విద్యార్థులకు ప్రస్తుతం త్రైమాసిక పరీక్షలు జరుగుతుండటంతో 1 నుండి 5వరకు చదివే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మాత్రమే సెలవు ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

వృద్ధుడికి వీల్ ఛైర్ ఇవ్వని ఉద్యోగుల సస్పెన్షన్



కోవై ఆసుపత్రితో వృద్ధుడిని నడిపించుకుంటూ వెళ్తున్న కుమారుడు

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కాలికి చికిత్స చేసుకున్న 70 యేళ్ల వృద్ధుడికి వీల్ చెయిర్ ఇవ్వకుండా ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఆ వృద్ధుడిని అతడి కుమారుడు చేయి పట్టుకుని ఆస్పత్రి ప్రాంగణం నుంచి నడిపించుకుంటూ వెళ్ళాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వెలువడింది. దీనితో ఆసుపత్రి డీన్ విచారణ జరిపి, వీల్ చెయిర్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రి సిబ్బంది ఎస్తర్ రాణి, మణివాసగంలను ఐదు రోజులపాటు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వు జారీ చేశారు.

తిరువొత్తియూర్‌లో పట్టుబడిన 'స్పైడర్' కోతి



బోనులో బంధించిన మెక్సికన్ కోతి

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లో మెక్సికన్ జాతికి చెందిన 'స్పైడర్' కోతిని అటవీ శాఖ సిబ్బంది మంగళవారం రాత్రి బంధించారు. కాలడిపేటలో ప్రాంతంలోని విద్యుత్ వైర్లు, చెట్లపై వేలాడుతూ అతివేగంగా వెళ్లడాన్ని గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వేళచ్చేరి అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని, అతికష్టం మీద కోతిని బంధించి బుధవారం ఉదయం వండలూరు జూ పార్క్ అధికారులకు అప్పగించారు. కాగా, ఇండోనేసియాలో సంచరించే ఈ అరుదైన రకం కోతి ఈ ప్రాంతానికి ఎలా వచ్చిందంటూ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నగర శివారులోని కాట్టుపల్లి హార్బర్‌కు విదేశాల నుంచి అక్రమంగా తరలిస్తుంగా, ఈ కోతి తప్పిపోయి నగరంలో సంచరిస్తుందా అనే అనుమానం కూడా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన మారథాన్



వేలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన మారథాన్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన మారథాన్‌ను జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ మారథాన్‌లో పలు కళాశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు మొత్తం 500 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, జిల్లా మెడికల్ ఆఫీసర్ భరణీధరన్, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి కీర్తిక, కౌన్సిలర్ చక్రవర్తి, జిల్లా ఆటల అధికారి సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.



పెరంబూరు మంగళపురంలో బుధవారం ఉదయం నిర్వహించిన 'ఉంగలుడన్ స్టాలిన్' విజ్ఞప్తుల స్వీకరణ శిబిరంలో ఓ లబ్ధిదారుడికి సాయం అందిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

గ్రీవెన్స్ వినతులకు సత్వర పరిష్కారం

కమిషనర్ అరుణ్

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కమిషనర్ అరుణ్ ఆయా స్టేషన్ల సిబ్బందిని ఆదేశించారు. ఎగ్మూర్‌లోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. పోలీసు కమిషనర్ అరుణ్ పాల్గొని ప్రజల నుంచి 16 వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా విన్నారు. ఈ సమస్యలపై విచారణ చేపట్టి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి బుధవారం నిర్వహించే ఈ గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని నగర పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

మహాబలిపురం తీరానికి 'బలి పీఠం'



పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహాబలిరం లోని తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హోటల్ వెనుక ఉన్న బీచ్‌లో మంగళవారం రాతి బలి పీఠం శిల్పం కొట్టుకు వచ్చిందని కొందరు పురావస్తు శాఖకు సమాచారం అందించారు. చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో సముద్రపు ఆలయం, ఐదు రథాలు, పల్లవ రాజుల పురాతన స్మారక చిహ్నం, అర్జునుడి తపస్సు, వెన్నముద్ద రాయి తదితరాలను పురావస్తు శాఖ పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో, ప్రస్తుతం బీచ్‌లో ఉన్న గుహాలయం లాగానే, చాలా సంవత్సరాల క్రితం మరి కొన్ని దేవాలయాలున్నాయని, సముద్రపు అలలు, ఆటుపోట్ల కారణంగా ఈ దేవాలయాలు సముద్రంలో మునిగాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో గత నెలలో పరిశోధకులు సముద్రంలో నిర్వహించిన సర్వేలో, ఒక పురాతన నగరం రాతి స్తంభాలు, మందిరాలు వంటివి కనుగొన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు హోటల్ వెనుక బీచ్‌లో బలి పీఠం శిల్పం తీరానికి కొట్టుకొచ్చింది. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న పురావస్తు శాఖ అధికారులు, సముద్రంలో కలిశాయని భావిస్తున్న ఆలయాలకు చెందిన శిల్పమా? ఎవరైనా చోరీ చేసి ఇక్కడ పడేశారా? అనే కోణాల్లో విచారణ చేపట్టారు.

బిజీ బిజీగా శివకార్తికేయన్



కోలీవుడ్‌లో వరుస హిట్‌లు తన ఖాతాలో వేసుకుంటున్న హీరో శివకార్తికేయన్.. మరో మూడు చిత్రాల్లో నటించేందుకు అంగీకరించారు. ఇందులో తనకు 'డాన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాన్ని అందించిన శిబి చక్రవర్తి దర్శకత్వం వహించే చిత్రంలో నటించనున్నారు. ఆ తర్వాత 'ది గోట్' దర్శకుడు వెంకట్ ప్రభు డైరెక్షన్‌లో మరో సినిమాకు కమిట్ అయ్యారు. ఈ రెండు చిత్రాల షూటింగులు పూర్తయిన తర్వాత పుష్కర్ గాయత్రి దర్శకత్వంలో తీసే మూవీకి ఓకే చెప్పారు. అదేసమయంలో 'గుడ్‌నైట్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాన్ని రూపొందించిన వినాయక్ చంద్రశేఖర్ డైరెక్షన్‌లో కూడా నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ మూవీపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సివుంది. కాగా, మెగా బ్లాక్‌బస్టర్ 'అమరన్' తర్వాత శివకార్తికేయన్ నటించిన 'మదరాసి' చిత్రం ఈ నెల 5న విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుని విజయవంతంగా ప్రదర్శితమవుతున్న విషయం తెల్సిందే.

19న 'కిస్' విడుదల



'కిస్'లో కవిన్, ప్రీతి అస్రానీ

'డాడా', 'బ్లడీ బెగ్గర్' వంటి చిత్రాల తర్వాత యువ హీరో కవిన్ నటించిన తాజా చిత్రం 'కిస్' ఈ నెల 19న విడుదలకానుంది. ఈ సినిమా ద్వారా ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ తొలిసారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. హీరోయిన్‌గా 'అయోద్ధి' ఫేం ప్రీతి అస్రానీ నటించారు. రోమియో పిక్చర్స్ అధినేత రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో హీరోహీరోయిన్లు కవిన్ - ప్రీతిలు ముద్దు సన్నివేశాల్లో పూర్తిగా లీనమైపోయి నటించడం ఇపుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది..

'ఎఫ్-1' రీమేక్‌లో నటించేందుకు అజిత్ అర్హుడు

● నరేన్ కార్తికేయన్

హాలీవుడ్ మూవీ 'ఎఫ్-1' తమిళ్ రీమేక్‌లో నటించేందుకు అజిత్ మాత్రమే అర్హుడని ప్రముఖ రేసర్ నరేన్ కార్తికేయన్ అభిప్రాయపడ్డారు. తాజాగా నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఘన విజయం సాధించిన 'ఎఫ్-1' హాలీవుడ్ మూవీ తమిళ రీమేక్‌లో ఎవరు నటిస్తే సరిపోతారని విలేకరులు ప్రశ్నించగా, ఆ పాత్రకు అజిత్ మాత్రమే సరిగ్గా సరిపోతారని అన్నారు. ఐదు పదుల వయసులో కూడా అనేక పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ వయసులో కూడా ఆయనకు కార్ రేసింగ్ పోటీలపై ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు. ఆయన నేను పాతికేళ్లుగా స్నేహితులం. దేశంలో మోటార్ స్పోర్ట్స్‌కు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఇపుడు ఆయనతో కలిసి నేనూ పని చేస్తున్నాను. మేమిద్దరం విజయాల కోసం శ్రమిస్తున్నాం' అని నరేన్ కార్తికేయన్ చెప్పుకుంటూ వచ్చారు.



అజిత్‌తో నరేన్ కార్తికేయన్

అలాంటి అదృష్టం ఎవరికి లభిస్తుంది

● మాళవికా మోహనన్



చిత్రజ్యోతి

మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి వంటి అగ్ర నటుడు ఆడిషన్ చేసే భాగ్యం ఎవరికైనా దక్కుతుందా అని ప్రముఖ హీరోయిన్ మాళవికా మోహనన్ అన్నారు. 'పేట' చిత్రం ద్వారా తమిళ ప్రేక్షకులకు పరిచయమైన మాళవికా మోహనన్.. ఆ తర్వాత 'మాస్టర్', 'తంగలాన్' వంటి హిట్ చిత్రాల్లో నటించారు. అయితే, ఆమె తొలిసారి దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'పట్టంపోలే' అనే చిత్రలో నటించారు. ప్రముఖ కెమెరామెన్ కె.యు.మోహనన్ కుమార్తె అయినప్పటికీ ఆమెకు కూడా ఆడిషన్ తప్పలేదు. ఈ ఆడిషన్‌కు ఆమెకు సహకరించిన నటుడు మమ్ముట్టి. ఈ విషయాన్ని ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. పైగా ఆడిషన్ సమయంలో మమ్ముట్టి తీసిన ఫొటోను ఆమె షేర్ చేసి, 'ఎవరికైనా ఇలాంటి అవకాశం లభిస్తుందా? కానీ, నాకు లభించింది. 'పట్టంపోలే' సినిమా కోసం కథానాయిక కోసం వెతుకుటుండగా నన్ను ఓ షూటింగ్ లొకేషన్‌లో మమ్ముట్టి చూసి, అక్కడే ఆడిషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫొటోలు తీశారు. ఆయనే నాకు తొలి చిత్రంలో నటించే అవకాశాన్ని కల్పించారు. అలా సినీ ఇండస్ట్రీలోకి నేను అడుగుపెట్టాను' అని ఆమె పాత జ్ఞాపకాలను వివరించారు.

బొమ్మల కొలువు... నట్టింట నెలవు

● నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతున్న బొమ్మలు



అమ్మవారి ప్రతిమను ఆసక్తిగా వీక్షిస్తున్న మహిళలు

నవ శిరస్సులతో తయారైన దేవీ ప్రతిమ

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి వేడుకల సందర్భంగా నగరంలో కొలువు బొమ్మల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. మైలాపూరు, అడయార్, ప్యారీస్ కార్నర్, పెరంబూరు, షావుకారుపేట, ఎగ్మూరు, నుంగంబాక్కం తదితర ప్రాంతాల్లో అందుబాటులో ఉంచిన రంగురంగుల దేవతామూర్తుల బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. దేవతలంతా దిగి వచ్చి ప్రతి ఇంటా 'దసరా కొలువు'లో ఆశీనులయ్యే శుభవేళ శరన్నవరాత్రులు. ఈ యేడాది నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22న ప్రారంభం కానున్నాయి. దసరా వేడుకల్లో ముఖ్యమైనది బొమ్మల కొలువు. ఈ బొమ్మల కొలువులు సాధారణంగా ఆడపిల్లలున్న కుటుంబాలు తప్పకుండా పెడతారు. ప్రతి ఇంటా దసరాకి బొమ్మల కొలువులు కనువిందు కలిగిస్తున్నాయి. బొమ్మల కొలువులో దేవతలు, దేవుళ్లు, జంతువులు, పక్షులు, వృక్షాలు, సైనికులు, యుద్ధ ట్యాంకర్లు, చంద్రయాణ్, గాంధీ, నెహ్రూ, రామకృష్ణ పరమహంస, వివేకానంద స్వామి, శంకరాచార్యులు తదితర మహాపురుషుల బొమ్మలు కూడా ఉంటాయి. మగువల ప్రతిభకు పట్టం కట్టే సృజనాత్మక సృష్టి బొమ్మల కొలువు. తెల్లని వస్త్రం పరిచిన మెట్లపై బొమ్మలను అందంగా అమరుస్తారు. కొందరు తొమ్మిది మెట్లు పెడితే మరికొందరు ఏడు మెట్లు పెట్టడం ఆనవాయితీగా భావిస్తారు. 'ప్రతి సంవత్సరం కొత్త బొమ్మలు కూడ పాత బొమ్మలకు జత చేస్తుంటారు. సంవత్సరానికి ఒకసారి పెట్టే బొమ్మల కొలువు కోసం ఆడపిల్లలు ఏడాది పొడవునా బొమ్మలు సేకరిస్తుంటారు. దసరా ప్రారంభానికి వారం రోజులే ముందే బజార్లు, సంతవీధులు బొమ్మల కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. మట్టి బొమ్మలు, పింగాణి బొమ్మలు, చెక్క బొమ్మలు మొదలైన ఎన్నో రకాల బొమ్మలు అంగళ్లతో కనువిందు కలిగిస్తున్నాయి. పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఆకులు, ఔషధాలు, పండ్లు, తదితర సహజసిద్ధమైన రంగులతో తీర్చిదిద్దిన బొమ్మలే ఈ కొలువులో తిష్టవేయనుండటం విశేషం.

22 నుంచి రాజ్ భవన్‌లో...

పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని రాజ్ భవన్‌లో ఈ నెల 22 నుంచి అక్టోబరు 1వ తేది వరకు 'నవరాత్రి బొమ్మల కొలువు' జరుగనుంది. దీనిని ఈనెల 22న గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రారంభించనున్నారు. 10 రోజులు జరిగే ఈ ప్రదర్శనలో ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పూజా కార్యక్రమాలు, 5 నుంచి 6 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్, క్యూ ఆర్ కోడ్ వినియోగించి ఈ నెల 20వ తేది లోగా ప్రదర్శన సందర్శించే తేదీతో పేరు నమోదుచేసుకోవాలి. ప్రతిరోజు 200 మందిని మాత్రమే అనుమతించనున్నారు. 'మొదట వచ్చిన వారికి ప్రాధాన్యత' అనే విధానంలో పేర్లు పరిశీలించి, ప్రదర్శనకు అనుమతి తేది వారి సెల్‌ఫోన్‌కు ఎస్ఎంఎస్ పంపనున్నారు. సందర్శకులు తగిన గుర్తింపు కార్డులతో రాజ్ భవన్ రెండో గేట్ నుంచి ప్రవేశించాలని రాజ్ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.



దశావతారాలు, రామాయణ గాథ ఘట్టాలకు సంబంధించిన బొమ్మలు - బొజ్జగణపయ్య బొమ్మ - బాహుబలి మోడల్ వినాయకుడి బొమ్మ

హొగెనేకల్ జలపాతంలో తగ్గిన ఇన్‌ఫ్లో

● పర్యాటకుల స్నానానికి అనుమతి



హొగెనేకల్ జలపాతంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక జలాశయాల నుండి విడుదలవుతున్న నీటి పరిమాణం తగ్గటంతో హొగెనేకల్ జలపాతంలో ఇన్‌ఫ్లో రెండు రోజులుగా తగ్గుముఖంపట్టింది. ప్రస్తుతం జలాశయంలోకి ప్రవేశిస్తున్న జలాల పరిమాణం సెకనకు 12 వేల అడుగులకు తగ్గింది. దీంతో బుధవారం పర్యాటకులను స్నానం చేయడానికి అధికారులు అనుమతించారు. నీటి ఉధృతి తగ్గటంతో ప్రదాన జలపాతం, సినీఫాల్స్, ఐందరువి తదితర జలపాతాల వద్ద పది రోజుల తర్వాత పర్యాటకులను స్నానానికి అనుమతిస్తూ జిల్లా కలెక్టర్ ఆర్.సతీష్ ఉత్తర్వు జారీ చేశారు.

ఏనుగుల ఆరోగ్యం కోసం ప్రత్యేక బాత్‌టబ్‌లు



హైడ్రోథెరపీ బాత్‌టబ్‌లో స్నానం చేస్తున్న ఏనుగు

చెన్నై,సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల కాలి నొప్పులను పోగొట్టేందుకు వెటర్నరీ వైద్యుల సలహా మేరకు ప్రత్యేక బాత్ టబ్‌లను ఏర్పాటు చేశారు. తిరుచ్చి సమీపం ఎంఆర్ పాళయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధ గజరాజుల సంరక్షణ కేంద్రంలో ప్రస్తుతం 9 ఏనుగులున్నాయి. వీటిలో గోమతి (71), సుమతి (60), సుందరి (65), ఇందిరా (66) అనే ఏనుగులు కాలి నొప్పులతో బాధపడుతున్నాయి. ఈ ఏనుగులకు వెటర్నరీ డాక్టర్లు హైడ్రో థెరపీ చేయడానికి వీలుగా ప్రత్యేక బాత్ టబ్‌లను ఏర్పాటు చేశారు. గంటసేపు ఆ బాత్ టబ్‌లో ఏనుగు స్నానం చేస్తే దాని కాలినొప్పులు తగ్గుతాయని వెటర్నరీ డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం బాత్‌టబ్‌లో స్నానం చేయడం వల్ల ఏనుగులు నిలువగలుగుతున్నాయని సంరక్షణ కేంద్రం అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రం నుంచే తొలి 'అమృత్ భారత్' సేవలు



పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'అమృత్ భారత్' ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ముందుగా రాష్ట్రం నుంచే ప్రారంభం కానున్నాయి. తక్కువ ఛార్జీ, ఏసీ సదుపాయంతో దూర ప్రయాణం చేసేలా 'అమృత్ భారత్' ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఆ ప్రకారం, తొలి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఈరోడ్ నుంచి బిహార్ రాష్ట్ర జోగ్బాని వరకు వారాంతపు రైలుగా నడపనున్నారు. ఈ మేరకు ఈ నెల 4వ తేది ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. ఈరోడ్ నుంచి ప్రతి గురువారం బయల్దేరే రైలు (నెం.16601) శనివారం జోగ్బాని చేరుకుంటుంది. ఈరోడ్ నుంచి ఉదయం 7 గంటలకు బయల్దేరే రైలు సేలం, జోలార్‌పేట, కాట్పాడి, అరక్కోణం, పెరంబూరు, నాయుడుపేట, గూడూరు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, నాగపూర్ మీదుగా శనివారం రాత్రి 7 గంటలకు జోగ్బాని చేరుకుంటుంది. మరుమార్గంలో, జోగ్బాని-ఈరోడ్ (నెం.16602) రైలు ఆదివారం మధ్యాహ్నం 3.15 గంటలకు జోగ్బానిలో బయల్దేరి బుధవారం ఉదయం 7.30 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. 22 బోగీలతో 3,300 కి.మీ ప్రయాణించనున్న ఈ రైళ్లు 50 ప్రధాన స్టేషన్లలో ఆగుతాయని, ఈ రైళ్ల ప్రారంభం తేది త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

అట్టహాసంగా 'పోలీసు డే' వేడుకలు

'పోలీసు దినోత్సవం' ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి



చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూరు రాజరత్తినం స్టేడియంలో బుధవారం ఉదయం 'పోలీసు దినోత్సవం' ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హోం శాఖ కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరై పోలీసు ఉన్నతాధికారులు, పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకల సందర్భంగా పోలీసు కుటుంబాల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో ఇన్‌ఛార్జి డీజీపీ వెంకట్రామన్, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ ఎ.అరుణ్ తదితర పోలీసు ఉన్నతాధికారులు, పోలీసులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నటరాజన్‌ను సత్కరిస్తున్న వీసీ

'శ్రీహర్'లో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని 'శ్రీ రామచంద్ర హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్' (శ్రీహర్)లో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాలు వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో 500 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది మానవహారం చేపట్టి, వృద్ధుల సంరక్షణ, పతన నివారణ గురించి అవగాహన కల్పించారు. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి జెరియాట్రిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీఎస్ నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధుల ఆరోగ్యంలో వస్తున్న మార్పులను, జీవనశైలి మార్పులతో ముడిపడి వున్న నాన్-కమ్యూనికబుల్ వ్యాధుల ప్రాబల్యాన్ని వివరించారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమా శేఖర్ ఈ సందర్భంగా డాక్టర్ వీఎస్ నటరాజన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ ఫ్యాకల్టీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆంటోనీ లియో అసీర్, డాక్టర్ టి.సెంథిల్‌కుమార్, శ్రీహర్ జెరియాట్రిక్ మెడిసిన్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న రాష్ట్రానికి చెందిన ఉపాధ్యాయులు డాక్టర్ రేవతి పరమేశ్వరన్, వి.విజయలక్ష్మిలను బుధవారం రాజ్‌భవన్‌కు ఆహ్వానించి సత్కరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి





శ్రీవారి ఆలయం ముందు శ్రీకాంత్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ నిర్మాత అంబికా కృష్ణ, నటుడు శ్రీకాంత్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.



అంబికా కృష్ణ

భక్తులకు మెరుగైన సేవలపై ప్రత్యేక దృష్టి

● అధికారులకు ఈవో సింఘాల్ సూచన

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత సేవా దృక్పథంతో, మరింత బాధ్యతగా సేవలను అందిద్దామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్నమయ్య భవనంలో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు సూచనల మేరకు శ్రీవారిసేవలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఛైర్మన్, సభ్యులు, డయల్ యువర్ ఈవో, ఐవీఆర్ఎస్ తదితర మార్గాల ద్వారా భక్తుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. వీలైనంతవరకు టెక్నాలజీ సాయంతో మెరుగైన సేవలు కల్పించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు నాణ్యతగా ఉన్నట్టు భక్తులు చెప్పారన్నారు. విధానపరమైన నిర్ణయాల్లో ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమష్టిగా నిర్ణయం తీసుకుని వేగంగా సేవలు అందిద్దామన్నారు. అంతకుముందు వివిధ విభాగాల అధికారులు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఈవోకు వివరించారు.


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైం స్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.07 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,828

తలనీలాలు సమర్పించినవారు: 26,296





కొక్కీల వలలో చిక్కుకున్న తాబేళ్లు

● కాపాడిన కోస్ట్‌గార్డ్ సిబ్బంది

చెన్నై, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మన్నార్ జలసంధి వద్ద సముద్రంలో జాలర్ల కొక్కీల వలల్లో చిక్కుకున్న అరుదైన రకం తాబేళ్లను కోస్ట్‌గార్ సిబ్బంది కాపాడి సురక్షితమైన సముద్ర ప్రాంతంలో విడిచిపెట్టారు. సోమవారం మధ్యాహ్నం కోస్ట్‌గార్డ్ గస్తీ నౌక వజ్రాలో మన్నార్ జలసంధి ప్రాంతంలో ప్రయాణిస్తుండగా రెండు చోట్ల ఇనుపకొక్కీల వలల్లో చిక్కుకున్న ఆలివ్ రెడ్లీ రకానికి చెందిన నాలుగు తాబేళ్లను గమనించారు. ఆ వలలో నుండి బయటపడలేక తాబేళ్లు ఊగటంతో వలలు బిగుసుకుపోయాయి. దానిని గమనించిన కోస్ట్‌గార్డ్ సిబ్బంది సముద్రంలోకి దూకి వలలతోపాటు ఆ తాబేళ్లను నౌకపైకి తెచ్చారు. ఆ తర్వాత వలలను పూర్తిగా తెంపి, నాలుగు తాబేళ్లను సురక్షిత సముద్ర ప్రాంతంలోకి విడిచిపెట్టారు. ఈ మేరకు స్థానిక కోస్ట్‌గార్డ్ కార్యాలయ అధికారులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వలల్లో చిక్కుకున్న తాబేలును సముద్రంలో విడిచిపెడుతున్న కోస్ట్‌గార్డ్ సభ్యులు

తంజావూరులో జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో 303 రకం రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని 2,3 స్థానాల్లో నిలిచిన జిల్లా హోంగార్డు విభాగం అసిస్టెంట్ కమాండర్లు కన్నియప్పన్, శ్రీధరన్‌లను అభినందిస్తున్న ఎస్పీ మయిల్‌వాహనం - వేలూరు.



డీఎంకే సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

వేలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే నందకుమార్ నేతలకు పిలుపునిచ్చారు. ఆనైకట్టు నియోజకవర్గ డీఎంకే కార్యకర్తల సమావేశం బుధవారం సేర్పాడి గ్రామంలో జరిగింది. జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు అధ్యక్షత వహించిన సమావేశంలో యువజన విభాగం డిప్యూటీ ఆర్గనైజర్ ప్రకాష్, జనరల్ కమిటీ సభ్యుడు మణిమారన్, నాయకులు శరవణన్, గణపతి, దినకరన్, తంగరాజ్, హరి, మణికంఠన్, శక్తివేలు, రంజిత్‌కుమార్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

సభ్యత్వ గుర్తింపు కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్



‘ఉంగళుడన్ స్టాలిన్’ శిబిరంలో అర్హులకు సహాయాలు



వేలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుప్పుమేడులో బుధవారం ‘ఉంగళుడన్ స్టాలిన్’ శిబిరం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దురైమురుగన్ అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు, రెవెన్యూ సర్టిఫికెట్లు అందజేశారు. శిబిరంలో ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, ఉప మేయర్ సునీల్‌కుమార్, 1వ మండల కమిటీ అధ్యక్షురాలు పుష్పలత, కౌన్సిలర్ శరవణన్, తహసీల్దార్ విజయ్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ సహాయలు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

కదిలొచ్చిన పోలేరమ్మ

● వైభవంగా అమ్మవారి ఉత్సవ ఊరేగింపు ● భక్తుల దర్శనార్థం ఆలయం వద్ద నిలుపుదల
● నేటి వెంకటగిరి జాతరకు సర్వం సిద్ధం

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుట్టిల్లయిన కుమ్మరి ఇంట బుధవారం రాత్రి రూపుదిద్దుకున్న పోలేరమ్మ ఊరేగింపుగా కదిలొచ్చారు. జాతర సందర్భంగా గురువారం భక్తులకు దర్శనం ఇవ్వడానికి ఆలయం వద్ద కొలువుదీరనున్నారు. వెంకటగిరి జాతరలో భాగంగా బుధవారం పోలేరమ్మ పుట్టినింట అమ్మవారి పీఠానికి దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు పీఠంపై అమ్మవారి ప్రతిమను (కళ్లు, దిష్టి చుక్క లేకుండా) తయారు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పుట్టినింట కొలువుదీరిన అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో వేగంగా కదలాలంటూ పోలీసులు నెట్టగా భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అర్ధరాత్రి 12గంటలకు సప్పరంపై అమ్మవారిని అధిష్ఠింపచేసి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటకు తీసుకొచ్చారు. ఇక్కడ ఆచార సంప్రదాయాలతో అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క ఏర్పాటు చేసి పూర్తి అలంకారం చేశారు. అక్కడ్నుంచి దివిటీల వెలుగుల్లో ఆసాదుల తప్పెట్లు, యువత చిందులు, కేరింతల నడుమ అమ్మవారి ఊరేగింపు మొదలైంది. ప్రతి ఇంటి ముంగిట అమ్మవారికి కోళ్లు, మేకలను బలిచ్చారు. దీంతో పట్టణంలోని రోడ్లు ఎర్రగా మారాయి. అలా.. ఊరేగింపుగా అమ్మవారం గురువారం తెల్లవారుజామునకు ఆలయం వద్ద వేప మండలతో వేసిన మండపంలో కొలువుదీరనున్నారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ సందర్భంగా భక్తులు వేయి కళ్ల దుత్తలతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఆ తర్వాత ట్రాక్టర్‌పై అమ్మవారిని ఊరేగింపుగా విరూప మండపానికి తీసుకెళ్లి ప్రతిమను ముక్కలు ముక్కలుగా చేయడంతో వెంకటగిరి జాతర ముగియనుంది.



పుట్టినిల్లు కుమ్మరి ఇంటి వద్ద పోలేరమ్మ

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి పుట్టింటి వద్ద.. జీనిగలవారి వీధిలోని అత్త వారింటి.. అమ్మవారి దేవస్థానం వద్ద పోలేమరమ్మను భక్తులు దర్శించుకొనేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యవేక్షించారు. ఇక, బందోబస్తు ఏర్పాట్లను బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు పరిశీలించారు. 8 మంది డీఎస్పీలు, 60 మంది సీఐలు, 110మంది ఎస్ఐలతో పాటు కానిస్టేబుల్, ప్రత్యేక దళాలు.. మొత్తంగా వెయ్యి మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, పోలీసు సిబ్బందికి వెంకటగిరి సీఐ రమణ విధులను అప్పగించారు.





అమ్మవారి ఆర్చి వద్ద భక్తుల కోసం క్యూలైన్ ఏర్పాటు - అమ్మవారి పుట్టినిల్లు దర్శనం కోసం బారులు తీరి భక్తులు

పెరుగుతున్న సైబర్ నేరాలు

● ఆన్‌లైన్ మోసాలతో రూ.2.683 కోట్ల స్వాహా ● రెండు లక్షల మందికి పైగా బాధితులు

చెన్నై, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతుండడం పట్ల పోలీసుశాఖ ఆందోళన చెందుతోంది. ఆన్‌లైన్ మోసాలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు పట్టించుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. రాష్ట్ర సైబర్ క్రైం పోలీసులు, చెన్నై తదితర జిల్లాల్లోని సైబర్ క్రైం విభాగం సమష్టిగా ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఆన్‌లైన్ మోసాల ద్వారా రూ.2683 కోట్ల మేర నష్టపోయారని పోలీసుల గణాంకాల్లో తేలింది. ఇక డిజిటల్ అరెస్టులంటూ ఏవీ లేవని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం దినపత్రికల్లో ప్రకటనలు చేసినా పట్టించుకోకుండా మోసగాళ్లమాటలకు భయపడి అప్పటికప్పుడు తమ ఖాతాల్లోని నగదు పోగొట్టుకుంటున్నవారు అధికంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. గత యేడాది 1.27లక్షల మంది వరకు ఆన్‌లైన్ మోసాలకు రూ.1010 కోట్ల మేర నష్టపోయారు. గత యేడాది జనవరి నుండి ఇప్పటి వరకు రాష్ట్రంలో 2.35 లక్షలమంది రూ.2683 కోట్ల మేర ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడి నష్టపోయారని సైబర్ క్రైం అధికారులు వివరించారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన 119 మందిని అరెస్టు చేశామని, వీరిలో ఏడుగురిని విదేశాల్లో అరెస్టు చేయగా, వారిలో 18 మందిపై గూండా చట్టం కూడా ప్రయోగించినట్లు తెలిపారు. సైబర్ నేరాలను తగ్గించాలంటే ఆన్‌లైన్‌లో అపరిచితులతో మాట్లాడకుండా ఉంటే చాలని, తెలియని లింక్‌ల జోలికి వెళ్ళకుండా ఉండాలని సైబర్ క్రైం అధికారులు చెబుతున్నారు. సెల్‌ఫోన్లలో ప్రత్యక్షమయ్యే కొన్ని లింకులు ప్రత్యేకించి అప్పులిస్తామంటూ ఆకర్షణీయమైన ప్రకటనలు ఉన్న లింకులు నొక్కితే బ్యాంక్ ఖాతాలో నగదు పోగొట్టుకునే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించారు. సైబర్ నేరాలు తగ్గాలంటే ప్రజల సహకారం అవసరమని, డిజిటల్ అరెస్టు తదితర సమస్యలు ఎదురైతే వెంటనే సైబర్ క్రైం విభాగానికి ఫోన్ చేస్తే చాలని, క్షణాల్లో ఆ విభాగం పోలీసులు చర్యలు చేపట్టి నగదు పోకుండా కాపాడగలుగుతారని పోలీసు అధికారులు చెప్పారు.



ఏచూరి వర్ధంతి రోజున దేహదానంపై ప్రచారం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం



పెరంబూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తొలి వర్ధంతి సందర్భంగా ఈ నెల 12వ తేది దేహదానంపై అవగాహన ప్రచారం చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. తన జీవిత కాలంలో పార్టీ కోసం, పేదల కోసం పనిచేసిన సీతారాం ఏచూరి మరణానంతరం తన దేహాన్ని ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి పరిశోధన కోసం ఇచ్చారని, తాను మరణించినా తన దేహం మరిన్ని పరిశోధనలకు ఉపయోగపడాలనే ఆయన ఆశయం అందరికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ క్రమంలో, ఏచూరి తొలి వర్ధంతి రోజైన ఈ నెల 12న ‘దేహ దానం సమాఖ్య’ పేరుతో సీపీఎం ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టిదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో, ఇష్టపడిన పార్టీ సభ్యులు, ప్రజలు తాము మరణించిన తర్వాత దేహాన్ని వైద్య పరిశోధనలకు అందించేలా ఒప్పంద పత్రం, కుటుంబ సభ్యుల అంగీకార పత్రం అందజేయాలని షణ్ముగం పిలుపునిచ్చారు.

ఎన్నికల్లో పోటీకి యువత సిద్ధం: సీమాన్

ప్యారీస్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ పేర్కొన్నారు. పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీచేసేందుకు 130 మంది యువకులను బరిలో దింపనున్నట్లు బుధవారం ఆయన మీడియాకు వివరించారు. ఆ పార్టీ తరఫున 234 నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఒక్కో నియోజకవర్గంలో చురుగ్గా పాల్గొంటున్న 30 మంది యువతను ఎంపిక చేసి, వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఒకరిని అభ్యర్థిగా నిర్ణయిస్తామని తెలిపారు. వీరిలో బాగా చదువుకున్న 65 మంది యువతులు కూడా ఉంటారని తెలిపారు. తిరుచ్చి లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న పార్టీ మహానాడు వేదికపై 130 మంది యువతతోపాటు 234 నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటిస్తామని సీమాన్ తెలిపారు.

